

వైభవంగా రథోత్సవాలు
- 7లో

ఇదో తంతు!



- ఓపక్క ఊరూవాడా అధికార దుర్వినియోగం, గిఫ్టుల మేళాలు
- మరోపక్క నిధుల కేటాయింపు లేని పనులకు శంకుస్థాపనలు
- పూర్తికాని భవనాలకు ప్రారంభోత్సవాలు
- ఇదీ వైసీపీ ప్రజాప్రతినిధుల ఉత్తుత్తి రిబ్బన్ కటింగ్‌ల హడావుడి
- నివ్వెరపోతున్న జనం, ప్రతిపక్షాలు

ఎన్నికల వేళ.. అధికార వైసీపీ చేస్తున్న జిమ్మిక్కులు అన్నీఇన్నీ కావు. ఓటర్ల జాబితాలను తారుమారు చేయడం దగ్గర మొదలైన వారి ఆగడాలు వలంటీర్లను పార్టీ కార్యక్రమాల కోసం వినియోగించడం వరకు ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఇదికాకుండా బహుమతుల పేరిట జరుగుతున్న తంతు అంతా బహిర్గతమే. మహిళలకు చీరలు, మగవారికి జత బట్టలు అందజేసే తాయిలాల కార్యక్రమం దాదాపుగా అన్నిచోట్లా జరుగుతోంది. దీనికి ప్రభుత్వ భవనాలనే వేదికగా చేసుకోవడం, అధికారులను సైతం ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం నివ్వెరపరుస్తోంది. తాజాగా ఎన్నికల షెడ్యూల్ వస్తే ఇబ్బంది వస్తుందనే కారణంతో ముందుగానే నిధులు కేటాయింపు లేని పనులకు శంకుస్థాపనలు, పూర్తి కాని భవనాలకు ప్రారంభోత్సవాల పేరిట జరుగుతున్న తతంగం మరింత ఆశ్చర్యపరుస్తోంది. పూర్తికాని భవనాలకు ప్రారంభోత్సవాలు ఏమిటంటూ ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. అయినాగాని నిస్సిగ్గుగా రిబ్బన్ కటింగ్‌లకు, కొబ్బరికాయలు కొట్టేయడానికి తమ అనుచరగణంతో వైసీపీ ప్రజాప్రతినిధులు బోల్డంత హడావుడి చేసేస్తున్నారు.





ఆలమూరు మండలం చొప్పెల్లలో పూర్తికాని కల్యాణ మండలం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

ఇదే చివరి సమావేశం.. అండగా నిలవండి! - మంత్రి విశ్వరూప్

అల్లవరం, మార్చి9: ఎన్నికల కోడ్ సమీపిస్తున్న వేళ అల్లవరం మండలంలో హడావుడిగా ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయి. గోడితిప్పలో రూ.59 లక్షలతో నిర్మించిన కల్వర్టు, బీటీ రోడ్డును మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. రూ.44 లక్షలతో నిర్మించిన గోడితిప్ప సచివాలయం, ఆర్బీకేను ప్రారంభించారు. రూ.6 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డును ప్రారంభించారు. అల్లవరం హైస్కూల్‌లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఇది చివరి సమావేశమని ఎన్నికలు వస్తున్నందున ప్రజలు తమ ప్రభుత్వానికి అండగా నిలవాలని విశ్వరూప్ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, ఏఎంసీ ఛైర్మన్ దంగేటి డోలామణి, కొనుకు బాపూజీ, తిక్కా వెంకటప్రసాద్, వడ్డి గంగ, సాధనాల వెంకట్రావు, బొమ్ము బాలవేణి, చిట్టినీడి శ్రీదేవి, ఎన్.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలా?

- ఎన్నికల హడావుడిపై టీడీపీ, జనసేన, బీజేపీ ఆందోళన

ఆలమూరు, మార్చి 9: వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందాలనే లక్ష్యంతో పనులు పూర్తికాకుండానే ప్రారంభోత్సవాల పేరుతో వైసీపీ నాయకులు హడావుడి చేస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆలమూరు మండలం చొప్పెల్లలో అసంపూర్తిగా ఉన్న కాపుకల్యాణ మండలం, ఎస్సీ కమ్యూనిటీ హాలు పనులు పూర్తి చేయకుండా ప్రారంభోత్సవాలకు సిద్ధం కావడం సిగ్గుచేటని చొప్పెల్లలో టీడీపీ మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, జనసేన మండల కన్వీనర్ సూరపురెడ్డి సత్య బీజేపీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి స్వామి విమర్శించారు. ఈ సందర్భంగా కల్యాణమండపం వద్ద నిరసన వ్యక్తంచేసి విలేకర్లతో మాట్లాడారు. ఐదేళ్లుగా పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయకుండా ఇప్పుడు ఎన్నికల వేళ వైసీపీ నేతలు ప్రారంభోత్సవాలు చేసి మభ్యపెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. చిత్తశుద్ధి ఉంటే తక్షణం నిధులు మంజూరుచేసి పనులు పూర్తిచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో నాయకులు బళ్ల హరి, జాంపోలు వెంకట్రావు, నైనాల శ్రీరామచంద్రమూర్తి, జాంపోలు నాగేశ్వరరావు, నాగిరెడ్డి మహేష్, అనుసూరి ఆంజనేయులు, మద్ది పట్టాభి పాల్గొన్నారు.



నల్లమిల్లిలో బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ భవనం.. కూలింగ్ యూనిట్ పనులు

'కోడ్' కూయకముందే..

పాల వ్యాపారం

- 'అమూల్' సంస్థ కోసం ప్రభుత్వ అధికారులంతా పరుగులు
- ఇటు శిక్షణ కార్యక్రమాలు.. అటు మిల్క్ కలెక్షన్ సెంటర్ల ఏర్పాట్లు

అమలాపురం రూరల్, మార్చి 9: అమూల్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం మేరకు జిల్లా నుంచి పాలను సరఫరా చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను అధికారులు ముమ్మరం చేశారు. ఏదొకవిధంగా ఎన్నికల కోడ్ బారిన పడకుండా వారెన్ని ప్రయత్నాలు చేస్తున్నా కోడ్ అవరోధం తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామాల్లో మహిళల సారథ్యంలో ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటుచేసి పాల సరఫరాపై శిక్షణ ఇచ్చే పనిలో పశుసంవర్ధకశాఖ అధికారులు ప్రస్తుతం యమ బిజీబిజీగా ఉన్నారు. మండల పరిధిలోని పేరూరు, గున్నేపల్లి అగ్రహారం, సాకుర్రు, వన్నెచింతలపూడి, నల్లమిల్లి తదితర గ్రామాల్లో శనివారం ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ సెంటర్ల మహిళా రైతు ప్రతినిధులతో పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జగనన్న పాలవెల్లువలో భాగంగా ప్రభుత్వమే జిల్లాలో ఐదు బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనుంది. దీనిలో భాగంగా అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లి, వాడపాలెం, జడ్.మేడపాడు, గోపాలపురం, రాయవరం గ్రామాల్లో 5 వేల లీటర్ల కెపాసిటీతో బీఎంసీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నల్లమిల్లిలో మిషనరీ బిగింపు పనులను పూర్తిచేశారు. ట్రయల్ రన్ నిర్వహించాల్సి ఉంది. ఇక గ్రామాల్లో మహిళా రైతు ప్రతినిధులతో ఏఎంసీలను ఏర్పాటు చేస్తున్నారు. అమలాపురం మండలంలో 16, అల్లవరంలో 9, అంబాజీపేటలో 13, పి.గన్నవరంలో 14, ఏంసీలను ఏర్పాటుచేశారు. ఒక్కో ఏఎంసీ నుంచి 180 లీటర్ల వంతున పాలను సేకరించడం లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. సేకరించిన పాలను ఆయా గ్రామాలకు సమీపాల్లో ఉన్న బీఎంసీలకు తరలించాల్సి ఉంది. 5వేల లీటర్ల పాలసేకరణ పూర్తయిన తరువాత ఆ పాలను అమూల్ సంస్థకు ప్రత్యేక వాహనం ద్వారా తరలిస్తారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాకుండానే బీఎంసీలను ప్రారంభించేవిధంగా జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా చర్యలు తీసుకుంటున్నట్టు పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు.



కొత్తపేట శనివారం జరిగిన టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అసంపూర్తి భవనాలకు ప్రారంభోత్సవాలా

వైసీపీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తీరుపై టీడీపీ శ్రేణుల ఆగ్రహం

కొత్తపేట, మార్చి9: సెంట్రింగ్ కూడా తియ్యని నిర్మాణంలో ఉన్న భవనాలకు ప్రారంభోత్సవాలు చేయడం ఏమిటంటూ టీడీపీ శ్రేణులు మండిపడ్డారు. స్థానిక పంచాయతీ ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఓఎన్జీసీ నిధులు రూ.39 లక్షలతో చేపట్టిన డయాలిసిస్ కేంద్ర భవనం నిర్మాణ దశలో ఉంది. అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలు అంటూ వైసీపీ నాయకులు ఈ డయాలిసిస్ కేంద్రాన్ని ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తుండడంపై టీడీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. నిర్మాణం పూర్తికాని భవనాలు ప్రారంభోత్సవం చేయడం వెనుక ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి ఓటమి భయం వెంటాడుతోందని అనిపిస్తోందన్నారు. అభివృద్ధి పనులు పూర్తి అయిన తర్వాత ప్రభుత్వ భవనాలు ప్రారంభించడం ఆనవాయితీ అని, ముందే ప్రారంభించడాన్ని ఆక్షేపించారు. కాగా మండలంలో టీడీపీ నాయకులు నిర్మాణం పూర్తికాని భవనాలను పరిశీలించారు. నిధులు మంజూరుకాని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మిభాస్కరరావు, యల్లమిల్లి జగన్మోహన్, ముత్యాల బాబ్జి, రెడ్డి తాతాజీ, మిద్దే ఆదినారాయణ, పల్లి ఏసు, లంకా సుబ్రహ్మణ్యం, కాశీ ధనరాజు, బూసి విష్ణుమూర్తి, పప్పుల ఏసు, పెనుమళ్ళ అన్నవరం తదితరులు పాల్గొన్నారు.



ఆదిలక్ష్మీపురంలో నీరందక ఎండిన దాళ్వా పొలం.. ఎండిపోయిన నాట్లను చూపిస్తున్న రైతు రమణ

పంట తడి కోసం.. కంట తడి!

- బీటలు తీస్తున్న పొలాలు
- అడ్డుకట్టలపై అధికారుల నిర్లక్ష్యం
- అడుగంటిన పంటకాల్వలు
- శివారు భూముల రైతులు గగ్గోలు
- ఆదుకోవాలంటూ డిమాండు



కూనవరం డ్రెయిన్‌పై వేసిన అడ్డుకట్ట (ఫైల్‌ఫొటో)

ఉప్పలగుప్తం, మార్చి 9: దాళ్వా పొలాలకు నీటి ఎద్దడి ఏర్పడింది. వంతుల విధానంలో శివారు ఆయకట్టుకు అన్యాయం జరుగుతోంది. సాగునీటి పంపకంలో, పొదుపులో అధికారులు దృష్టిపెట్టడం లేదంటూ శివారు రైతులు గగ్గోలు పెడుతున్నారు. శివారు పొలాలు ఎండిపోతుంటే రైతులు విలవిల్లాడుతున్నారు. ఎగువ ఆయకట్టు రైతులు నీటిని అవసరానికి మించి వినియోగించుకుని డ్రెయిన్ల పాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా గతంలో అవసరమైన చోట్ల డ్రెయిన్లకు అడ్డుకట్టలు వేసి ఆ నీటిని పొలాలకు మళ్లించడం ద్వారా నీటి ఎద్దడిని నివారించేవారు. అయితే సాగునీటి ఎద్దడి నివారణకు ప్రతి ఏడాది అయినాపురం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని గొరగనమూడి, కూనవరం, రంగరాజుకోడుల పై అడ్డుకట్టలు వేసి సాగునీరు వృథాగా పోకుండా పొదుపు చేసేవారు. ఈ ఏడాది ఆ ప్రయత్నాలు లేకపోవడంతో అయినాపురం- పేరాయిచెరువు, లక్ష్మీవాడ-వాడపర్రు పంటకాల్వ ఆయకట్టు పరిధిలో శివారు పొలాలు బీటలు వారుతున్నాయి. ఈ ఆయకట్టుల్లోని శివారు రైతులు నాట్లు ఎండిపోతుంటే కంటతడి పెడుతున్నారు. ముంపు బెంగతో సార్వా సాగు విరమించుకుని దాళ్వా నాట్లు వేసుకుంటే ఈ పంట కూడా చేతికి దక్కే అవకాశం కన్పించడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు గాని, ప్రజాప్రతినిధులుగాని దాళ్వా నీటి ఎద్దడిని పట్టించుకోవడంలేదని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం దాళ్వా పైరు పొట్ట, ఈనిక దశల్లో ఉంది. ఈ సమయంలో చేలో తడి ఆరిపోతే ఈనిక కష్టమని, ఇప్పటికే ఈనిక జరిగిన పొలాల్లో గింజలు పొల్లుగా మారతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం శివారు ఆయకట్టు పొలాలకు నీరందించి పంటను రక్షించాలని వారంతా కోరుతున్నారు.

ఎండిపోతున్నా పట్టించుకోరా..

పేరాయిచెరువు పంటకాల్వ శివారు ఆయకట్టులో ఉన్నాం. సార్వాలో ముంపు బెడద ఎక్కువ. అందుకే సార్వా మానుకున్నాం. ఇప్పుడు దాళ్వా నాట్లు నీరులేక ఎండిపోతున్నాయి. గతంలో గొరగనమూడి డ్రెయిన్‌కు అడ్డుకట్ట వేసి నీటిని పొలాలకు మళ్లించేవారు. ఈ ఏడాది అడ్డుకట్టల మాటే లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు సాగునీటి ఎద్దడిపై దృష్టి పెట్టడంలేదు. తక్షణం నీరివ్వకపోతే మా చేలన్నీ నాశనమవుతాయి.

- పెయ్యల రమణ, రైతు, పేరాయిచెరువు

ఇప్పుడు నీటి అవసరం ఎక్కువ

ప్రస్తుతం దాళ్వా పంట పొట్ట, ఈనిక దశలో ఉంది. ఈ దశల్లో పొలానికి చాలినంత నీరు అందించాలి. లేకుంటే ఈనిక పూర్తిగా జరగదు. పొలాల్లో కనీస మట్టంలో నీరుండేలా చూడాలి.

- జి.కుమార్‌బాబు, వ్యవసాయాధికారి

అడ్డుకట్టల కోసం నివేదిక పంపించాం

గతంలో మాదిరిగానే మురుగుకాల్వలపై అడ్డుకట్టల ఏర్పాటుకు నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాం. అయితే కొందరు రైతులు కలెక్టర్‌ను కలిసి తమ ఏరియాలో అడ్డుకట్టల ఆవశ్యకతను వివరించారు. దీంతో అడ్డుకట్టల నిర్మాణానికి కలెక్టర్ అంగీకరించారు. కానీ ఒక్క భట్నవిల్లి డ్రెయిన్‌పై మాత్రమే అడ్డుకట్ట నిర్మించారు.

- సునీత, ఏఈ, డ్రెయిన్స్



తెలుగు మహాసభల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు, మాజీ ఎంపీ యార్లగడ్డ, మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, వంగూరి ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు

తెలుగు భాషను భావితరాలకు చేర్చాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- కాకినాడలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు ప్రారంభం
- దేశ, విదేశాల నుంచి ప్రముఖ సాహితీవేత్తలు హాజరు

- 7లో

'పొత్తు'తో చిత్తే

- టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పొత్తుతో ఉమ్మడి జిల్లాలో వైసీపీలో వణుకు
- ఇక ఎన్నికల్లో తమ పని అయిపోయినట్టేనని ఆ పార్టీ నేతల కలవరం
- ఒకపక్క తీవ్ర ప్రజా వ్యతిరేకత, మరోపక్క బలమైన కూటమితో ఏం పాలుపోని పరిస్థితి
- 2014 అసెంబ్లీ ఎన్నికల నాటి ఫలితాలు పునరావృతమవుతాయనే లెక్కలతో గుబులు
- ఇప్పటికే ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన కూటమి జోరు

(కాకినాడ -ఆంధ్రజ్యోతి)

ఒకపక్క తీవ్ర ప్రజావ్యతిరేకత, మరోపక్క మూడు పార్టీలు కలిసి వస్తుండడంతో ఎన్నికల్లో ఫ్యాన్ చిత్తయిపోవడం ఖాయమనే లెక్కలతో ఆ పార్టీ నేతలు బెంబేలెత్తుతున్నారు. 2104 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలు కలవడంతో అప్పట్లో వైసీపీ చిత్తుచిత్తైపోయిందన్న లెక్కలు గుర్తు చేసుకుని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆ పార్టీ నేతలు ఉలిక్కిపడుతున్నారు. ఇప్పుడు అవే ఫలితాలు పునరావృతమవుతాయనే అంచనాలతో గుబులు చెందుతున్నారు. ఈసారి ఎన్నికల్లో కాకినాడ ఎంపీ లేదా ఎమ్మెల్యేగా పవన్ పోటీ చేస్తారంటూ బలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బలమైన టీడీపీకి పవన్ బలం తోడవుతుండడంతో ఉమ్మడి జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అన్ని స్థానాల్లో క్లీన్ స్వీప్ చేసేస్తుందనే విశ్లేషణలు వైసీపీకి కునుకు పట్టనీయడం లేదు. దీంతో నియోజకవర్గాల్లో బరిలో ఉన్న వైసీపీ ఇన్‌చార్జులకు తమ రాజకీయ భవిష్యత్తు కళ్లముందే కనిపిస్తుండడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ అరాచకమే హద్దుగా పాలన సాగించింది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఉమ్మడి జిల్లాలో ఎక్కడికక్కడ అందినకాడికి అడ్డంగా దోచేశారు. మట్టి, గ్రావెల్, పేదల ఇళ్ల స్థలాల కొనుగోలు, లేఅవుట్ల చదును వరకు కోట్లలో కొట్టేశారు. దీనికితోడు జగన్ ప్రభుత్వం ప్రజలకు ఈ ఐదేళ్లలో ప్రత్యక్ష నరకం చూపించింది. పన్నుల బాదుడు, రహదారుల గుంతలు, విద్యుత్ చార్జీల మోత, ప్రశ్నిస్తే కేసులు.. ఒకటేంటి నియంతృత్వ పాలనతో ప్రజలకు కంటిపైకునుకు లేకుండా చేసింది. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదనే అంచనాలు నెలకొన్నాయి. విపరీతంగా ప్రజల్లో పేరుకుపోయిన వ్యతిరేకతతో ఆ పార్టీ ఓటమి ఖాయమన్న విశ్లేషణలు నెలకొన్నాయి. ఎంత వ్యతిరేకత ఉన్నా వలంటీర్లను అడ్డం పెట్టుకుని ఓటర్లను బెదిరించడం, కోట్లలో డబ్బును కుమ్మరించడం, తమకు మాత్రమే అందుబాటులో ఉన్న కోట్ల డబ్బుతో ఓటర్లను కొనేసి ఏదోలా గట్టెక్కేద్దామని ఇంతకాలం ధీమాగా ఉంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల అక్రమాలకు తెరలేపింది. ఇప్పుడు వైసీపీ ప్రణాళికలు పటాపంచలవుతున్నాయి. ఏదోలా గెలిచేస్తామనే అంచనాలు కాస్తా ఆవిరవుతున్నాయి. ఎన్నికల క్షేత్రంలోకి టీడీపీ, జనసేన కలిసి వెళ్లాలని ఇప్పటికే నిర్ణయించగా, తాజాగా కేంద్రంలో అత్యంత బలంగా ఉన్న బీజేపీ కూడా ఈ రెండు పార్టీలతో పొత్తు అధికారికంగా ఖరారు చేసుకోవడంతో ఇప్పుడు వైసీపీకి నిద్రపట్టడం లేదు. ఈ మూడు పార్టీల కలయికతో ఎన్నికల్లో తాము చిత్తవడం ఖాయమని జిల్లాలో వైసీపీ నేతలు అప్పుడే విశ్లేషించుకుంటున్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి పొత్తు కుదిరినా అధికారం చేతిలో ఉండడంతో డబ్బు, మద్యం యథేచ్ఛగా పంచవచ్చని, దొంగ ఓట్ల బలం ఎలాగో కాస్తుందని ఇంతకాలం వైసీపీ ధీమాగా ఉంది. కానీ ఇప్పుడు బీజేపీ కలవడంతో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడడం సులువుకాదని భావిస్తోంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. అప్పట్లో ఈ మూడు పార్టీల ముందు వైసీపీ చిత్తుచిత్తయింది. దీంతో ఇప్పుడు మళ్లీ ఆ పాత కలయిక చిగురించడంతో తమ పని అయిపోయిందని వైసీపీ నేతలు బెంగపడుతున్నారు. పైగా ఈసారి ప్రజా వ్యతిరేకత మామూలుగా లేదనే విషయం అర్థమై నియోజకవర్గాల్లో పలువురు వైసీపీ ఇన్‌చార్జులకు అప్పుడే ఓటమి భయం పట్టుకుంది. దీనికితోడు ఇప్పటికే టీడీపీ, జనసేన పొత్తుతో వైసీపీకి గట్టి దెబ్బ తగలడం ఖాయం అనే విశ్లేషణలు కొనసాగుతున్నాయి. ఈ రెండు పార్టీలు కలవడంతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఫ్యాన్‌ను దెబ్బకొట్టేస్తుందని ఆ పార్టీ నేతలు కొంతకాలంగా తలపట్టుకున్నారు. దీనికి అదనంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉమ్మడి జిల్లాలోని కాకినాడ నుంచే ఎంపీ లేదా ఎమ్మెల్యేగా బరిలోకి దిగడం ఖాయమని తేలిపోయింది. ఈ నేపథ్యంలో ఆయన ప్రభావం కాకినాడ జిల్లాతోపాటు ఉమ్మడి జిల్లాపైనా బలంగా ఉండనుంది. తద్వారా వైసీపీకి వ్యతిరేక గాలి ఫ్యాన్ ముక్కలయ్యే స్థాయిలో ఉంటుందని వైసీపీలోను బలంగా ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 స్థానాలకుగాను టీడీపీ కూటమి ఏకంగా 13 సీట్లు కైవసం చేసుకుంది. వైసీపీ కేవలం ఐదు సీట్లకే పరిమితమైంది. కాకినాడ జిల్లా వరకు చూసుకుంటే కేవలం మూడు స్థానాల్లో గెలిచింది. ఇప్పుడు 2014 నాటి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తిరిగి జత కట్టడంతో అప్పట్లో వైసీపీకి వచ్చిన సీట్లు కూడా ఈసారి రావని సొంత పార్టీలోనే చర్చ జరుగుతోంది. తమతో తాజాగా బీజేపీ కూడా కలవడంతో టీడీపీ, జనసేన పార్టీల్లో ఇంకా జోష్ పెరిగింది. ఇరుపార్టీలు కలిసి జగన్‌ను ఎదుర్కొని గెలుస్తామని ధీమాగా ఉన్నా, అధికార పార్టీ అరాచకాలు, అక్రమాలను నిలువరించే విషయంలో కొంత భయం కొనసాగింది. ఇప్పుడు బీజేపీతో పొత్తు ఖాయమైపోవడంతో తిరుగులేని స్థాయిలో వైసీపీని గోదాట్లో ముంచేయడం ఖాయమనే ధీమాలో ఉన్నాయి.



అమలాపురంలో ముస్తాబవుతున్న మొల్లాముస్తఫా మసీదు

రేపటి నుంచి రంజాన్ ప్రార్థనలు ప్రారంభం

అమలాపురం టౌన్, మార్చి9: ఈనెల 11 నుంచి పవిత్ర రంజాన్ నెల ఖురాన్ పఠనంతో ప్రారంభమవుతుందని అమలాపురం మొల్లాముస్తఫా మసీదు కమిటీ ప్రతినిధులు తెలిపారు. 12 నుంచి మొదటి ఉపవాస దీక్ష ప్రారంభమవుతుందని కమిటీ సభ్యులు ఎండీ అమీర్, ఎంఎంకేజీ మొయినుద్దీన్‌లు తెలిపారు. నెలవంక చూసిన రోజు నుంచి ఖురాన్ పఠనాన్ని ప్రారంభించి తరాబీ నమాజ్‌లు చేస్తామన్నారు. ఈ సందర్భంగా మొల్లాముస్తఫా మసీదును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు.

తెలుగు భాషను భావితరాలకు చేర్చాలి

- భాషపై సానుకూల దృక్పథం కలిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలి
- మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు
- కాకినాడలో ప్రారంభమైన అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు
- దేశవిదేశాల నుంచి సాహితీవేత్తలు హాజరు



వెంకయ్యనాయుడును సత్కరిస్తున్న ప్రముఖులు

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 9: భావితరాలకు తెలుగు భాష సంస్కృతి పట్ల సానుకూల దృక్పథం కలిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. తెలుగు భాష అమ్మపాల వంటిదన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా కన్న తల్లి, మాతృభాష, మాతృదేశాన్ని మరువకూడదని చెప్పారు. తెలుగు భాష పరిరక్షణ కోసం వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో దంటు కళా క్షేత్రంలో రెండు రోజుల పాటు నిర్వహించే సదస్సును శనివారం మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వంగూరి ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో వెంకయ్యనాయుడు మాట్లాడారు. ఆట, పాట, కట్టు, బొట్టు, సంస్కృతి తెలుగు భాష విశిష్టతను తెలియజేస్తాయని వివరించారు. రాబోయే తరాలకు ప్రతిఒక్కరూ సాహిత్య పరిమళాలను అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. నన్నయ్య, తిక్కన, శ్రీనాథుడు, పోతన వంటి వారు తెలుగు సాహిత్యానికి ప్రాణం పోశారని గుర్తు చేశారు. అన్నమయ్య, భర్తృహరి లాంటి వారు అచ్చ తెలుగు పదాలతోనే గేయాలు, కవితలు రాశారని చెప్పారు. రాచరికంలో రాజులు కవులను ప్రోత్సహించిన విధంగానే, నేటి ప్రభుత్వాలు భాషాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. మమ్మి, డాడీ సంస్కృతి పోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలతో అమ్మానాన్న అని పిలిపించుకోవాలని అన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషను బతికించుకునేందుకు సాహితీ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. భాషాభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. శాసనసభ మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగుభాష పరిరక్షణకు మరిన్ని సదస్సులు నిర్వహించాలని ఆకాంక్షించారు. సాహితీవేత్తలంతా ఒకచోట హాజరై తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం సంతోషకరమని చెప్పారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు మాట్లాడుతూ సదస్సు కోసం దేశ, విదేశాల నుంచి సాహితీవేత్తలంతా తరలిరావడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వంగూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నాలుగు పుస్తకాలను ముఖ్య అతిథి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రాన్స్‌కు చెందిన డేనియల్ నేజర్, డాక్టర్ వంశీ రామరాజు, మంగిపూడి రాధిక, ఎర్రాప్రగడ రామకృష్ణ, వైఎస్ఎన్ మూర్తి, పతంజలిశాస్త్రి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, భువనచంద్ర తదితరులు తమ అభిప్రాయాలను చర్చావేదిక రూపంలో అందించారు. సదస్సుకు 100 మందికి పైగా సాహితీవేత్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు మార్ని జానకీరామ్‌చౌదరి, కె.గౌరీనాయుడు, మణిబాబు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న వెంకయ్యనాయుడు



మండలి బుద్ధప్రసాద్‌కు జ్ఞాపిక బహూకరణ

అప్పనపల్లిలో భక్తుల రద్దీ


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, మార్చి 9: భక్తుల తాకిడితో అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. కొత్త, పాత గుడులు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం స్వామివారిని 3459మంది దర్శించుకుని 2571 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,35,039 ఆదాయం వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ధర్మకర్తల మండలి ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శృంగారవల్లభ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి



పెద్దాపురం, మార్చి 9: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 3,63,450 అన్నదాన విరాళాలు రూ. 81,441 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.4,320, తులాభారం రూ.400 వెరసి రూ.4,49,611 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపాయి.. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం ఛైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వరుని రథోత్సవం


రథాన్ని లాగి ప్రారంభిస్తున్న చినరాజప్ప, దొరబాబు





సామర్లకోట, మార్చి 9: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్ల రథోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి పల్లకీపై ప్రదర్శించుకుని గాంధీబొమ్మసెంటర్‌కు మంగళవాయిద్యాల మధ్య తీసుకుని వచ్చారు. అప్పటికే రథంపై సిద్ధంగా ఉన్న పండితులు చెరుకూరి రాంబాబు, అంజిబాబు, శ్రీనివాస రావు, వినయ్ ఉత్సవమూర్తులను పల్లకీ నుంచి రథం వేదికపై అలంకరించారు. శాస్త్రోక్తంగా గుమ్మడికాయను అన్నం కుంభంపై పగలకొట్టి హారతులు ఇవ్వగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మ కాయల చినరాజప్ప తాడు లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పెద్దాపురం ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, కౌన్సిలర్, రథోత్సవ కమిటీ ప్రతినిధి యార్లగడ్డ జగదీష్, టీడీపీ, వైసీపీ నాయకులు ఆలయ కార్యనిర్వహణాదికారి బళ్ల నీలకంఠం తది తరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం జరిగిన రథోత్సవంలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు తదితర ప్రజాప్రతినిధుల సమక్షంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. కోల సంబరం, వీరభద్రుని సంబరం, గోవింద గోవింద నృత్యం, కోబ్రా నృత్యం, తీన్మార్ డప్పుల డ్యాన్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి, బాణసంచా కాల్పులు, మంగళవాయిద్యాల నడుమ వందలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ సిబ్బంది రథోత్సవాన్ని అనుసరించారు. అంతకుముందు ఉదయం భీమేశ్వరాలయంలో స్వామివారికి అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ధూపసేవ నిర్వహించి పల్లకీలో దేవతామూర్తులను అలంకరించి రథోత్సవం వరకూ పల్లకీ సేవ నిర్వహించారు.

వైభవంగా రథోత్సవం




రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పిఠాపురం, మార్చి 9: పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి రథోత్సవం శనివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై ఉత్సవ మూర్తులను ఉంచి కుంతీ మాధవస్వామి కోనేరు నుంచి ఉప్పాడ బస్టాండ్ వరకూ రథాన్ని లాగి సెంటర్‌లో నిలిపారు. భక్తులు స్వామి, అమ్మవార్లను రథంపై దర్శించుకున్నారు. అక్కడ బాణాసంచా కాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంతకుముందు స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీపై ఉంచి పాదగయ నుంచి నాయకులు ప్రజాప్రతినిధులు పల్లకీని మోస్తూ కుంతీ మాధవస్వామి దేవస్థానం వరకూ తీసుకువచ్చి అక్కడ రథంపై ఉంచారు.. రథోత్సవంలో కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, సీఐ శ్రీనివాస్, ఉత్సవకమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


రంగులు చల్లుకుంటున్న అర్చక స్వాములు


ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పోలీసులు

సంబరంగా సాగిన నాకబలి..దొంగలతోపు

పిఠాపురం, మార్చి 9: పాదగయ క్షేత్రంలో కుక్కుటేశుని కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం వివిధ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉత్సవ విగ్రహాలు చేతపట్టుకుని రంగులు చల్లుతూ నిర్వహించిన కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీసమేత ఉమాకుక్కుటేశ్వస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, సహస్ర పుష్పార్చన జరిగింది. సాయంత్రం నాకబలి-దండియాడింపు-దొంగలతోపు ఉత్సవం ఉత్సాహపూరితంగా సాగింది. స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు జరిపారు. పూజా కార్యక్రమాలు నిర్వహించిన అర్చకులు పరస్పరం రంగులు చల్లుకొన్నారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై ఉంచి దేవస్థానం నుంచి ప్రదర్శనగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కింగ్‌కాంగ్ డాల్స్, శక్తి వేషధారణలతో కళాకారులు ప్రదర్శించిన విన్యాసాలు భక్తులను అలరించాయి. కార్యక్రమాల్లో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఈవో, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారులతో ఎంపీ, ఎమ్మెల్యేలు కోలాటం ఆడారు. పోలీసులు అందరూ ఉత్సవమూర్తులను మోసి కుక్కుటేశుని సేవలో పాలుపంచుకున్నారు.


కోలాహలంగా బాలయోగీశ్వరుల తీర్థం


తపో మందిరం వద్ద భక్తుల సందడి

ముమ్మిడివరం, మార్చి 9: శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తీర్థ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో శనివారం తెల్లవారుజామున సుప్రభాతసేవ, ప్రత్యేక అభిషేకాలు, హారతులు, దివ్య సమాధుల వద్ద పూజలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మద్రాసు, దేశం నలుమూలల నుంచి భక్తులు భగవాన్ పెదబాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరుల దివ్య సమాధులను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు స్వామివారి దివ్య సమాధులను భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు వసతి, భారీ అన్న సమారాధన వంటి వాటిని ఏర్పాటు చేశారు. తపో ఆశ్రమ కమిటీ, కుటుంబ సభ్యులు భక్తులకు అవసరమైన వసతి, భోజన సదుపాయాలు కల్పించారు. మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, హితకారిణి సమాజ్ ఛైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, పెన్మెత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జి, కుడుపూడి శంకరరావులతో పాటు వైసీపీ నాయకులు, జడ్పీటీసీ సభ్యులు బాలయోగీశ్వరుల దివ్య సమాధులు, విగ్రహాలను దర్శించుకుని పూజలు జరిపించారు. జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ, పార్టీ నాయకులు బాలయోగీశ్వరుల దివ్య సమాధులను దర్శించుకున్నారు. ఆయన వెంట దూడల స్వామి, సానబోయిన వీరభద్రరావు, యలమంచిలి బాలరాజు, పితాని రాజు, గొలకోటి సాయి బాబులతో పాటు పలువురు ఉన్నారు.


తీర్థానికి వచ్చిన భక్తులు

కిటకిటలాడిన వాడపల్లి



ఆత్రేయపురం, మార్చి9: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువ జామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.46.84 లక్షలు లభించినట్టు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు


స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

దుర్గాడ శివాలయంలో అభిషేకాలు



గొల్లప్రోలు రూరల్, మార్చి 9: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి శనివారం అభిషేకాలు నిర్వహించారు. లింగోద్భవకాల అభిషేకంతో పాటు స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఆవుపాలు, పెరుగు, నెయ్యి, పంచదార, పండ్లు, చెరకు రసాలు, విభూది, గంధం, రోజ్ వాటర్ తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి. అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. స్వామిని పుష్పాలతో, ఆయా అభిషేక ద్రవ్యాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భావనారాయణస్వామికి వెండి ఆభరణాలు


వెండి ఆభరణాలు తీసుకువస్తున్న దాతలు

సర్పవరం జంక్షన్, మార్చి 9: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామికి రూ.6.50 లక్షల విలువ చేసే రూ.7.50 కిలోల వెండి ఆభరణాలను భక్తులు సమర్పించారు. కాకినాడకు చెందిన భక్తులు చిక్కాల చౌదరయ్య (తాతాజీ), సత్యపూర్ణలక్ష్మి దంపతులు శనివారం సర్పవరం స్వామివారి ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జొన్నాడ భీమశంకరరావుకు రూ.7.50 కిలోలతో తయారు చేయించిన అమ్మవారి కిరీటం, వెండి కర్ణపత్రాలు, కమలా హస్తములు, అభయ హస్తములు, వృక్షస్థలాభరణం, బుట్ట చీరాభరణం, రాజ్యలక్ష్మి అమ్మవారికి వెండి వడ్డాణం, ఉత్సవమూర్తులు శ్రీదేవి భావనారాయణస్వామికి వెండి వడ్డాణాలను అందజేశారు. వెండి ఆభరణాలు అందించిన చౌదరయ్యసత్యపూర్ణలక్ష్మి దంపతులకు గ్రామస్థుల తరఫున ఛైర్మన్ నారాయణరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర తెలియజేసే పుస్తకం, స్వామివారి ప్రసాదాన్ని దాతలకు అందించారు.

లింగోద్భవకాల పూజలు

సామర్లకోట, మార్చి 9: మహాశివరాత్రి విశేష పూజలలో భాగంగా శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం తెల్లవారుజామున 2 గంటల వరకూ భీమేశ్వరుని శివ లింగానికి లింగోద్భవకాల పూజలు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలను కంచి మహా సంస్థానం వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి తదితర పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచ ద్రవ్యములతో అభిషేకించారు. మానస సరోవరం నుంచి తెచ్చిన లక్షలాది పవిత్ర రుద్రాక్షలు స్వామివారిని అభిషేకించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తుల దర్శనాలకు అనుమతించారు. పూజల అనంతరం రుద్రాక్షలను పతంజలి చేతుల మీదుగా పలువురు భక్తులకు పంపిణీ చేశారు. ఈ పూజలలో పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాస్ విద్యుల్లత దంపతులు, బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, చుండ్రు గోపాలకృష్ణ, ఆర్వీ సుబ్బరాజు, గంజి బూరిబాబు, అమలకంటి శ్రీనివాసరావు, గుండు శంకరరావు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం స్వామివారికి త్రిశూలస్నానం, తీర్థపు సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నీలకంఠం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

వేట కుక్క దాడిలో కణుజు మృతి


పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

తుని రూరల్, మార్చి 9: వేట కుక్క దాడిలో కణుజు హతమైంది. కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవ సమీపంలో కొండ దిగువకు కణుజు వచ్చింది. కుమ్మరిలోవ ఎస్ఎస్‌వీ నగరం, ఎన్.సూరవరం, కొలిమేరు ప్రాంతాలను ఆనుకుని ఉన్న పచ్చటి కొండల్లో వన్యప్రాణులు తలదాచుకుంటున్నాయి. అయితే వీటిపై అధికార పార్టీకి చెందినఒక వేటగాడు కన్ను పడటంతో ఆ ప్రాంతంలో యథేచ్ఛగా వన్యప్రాణులను వేటాడుతున్నట్లు తెలిసింది. ఈ కోవలోనే కణుజును కుక్కలు వేటాడి హతమార్చి ఉంటాయని స్థానికులు చెబుతున్నారు కుమ్మరిలోవ సమీపంలో వేటకుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన తల్లి, పిల్ల కణుజు కుమ్మరిలోవ ప్రాంతానికి చేరుకున్నాయి. అయితే స్థానికులు వాటిని గమనించి కాపాడే ప్రయత్నం చేశారు. స్థానికుల రాకతో పిల్ల కణుజు కొండపైకి వెళ్లగా, తల్లి కణుజు గాయాలతో పడి ఉంది. స్థానికులు కాపాడే ప్రయత్నం చేయగా కొద్ది సేపటికే మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. కేసు నమోదు చేసి, కణుజును ఖననం చేసినట్లు ఎఫ్ఎస్‌వో రాంబాబు తెలిపారు.

మహాసంకల్ప యాత్ర

అమలాపురం టౌన్, మార్చి 9: పేరూరు ఇందిరా కాలనీలో జనసేన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో 109వ రోజు మహా సంకల్ప యాత్ర ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి జనసేన సిద్ధాంతాలను వివరిస్తూ టీడీపీ-జనసేన కూటమికి ఓటేయాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మహాదశ నాగేశ్వరరావు, సూదా చిన్నా, ఆకుల బుజ్జి, మొయిల శివ తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌పై స్వర్ణకార, విశ్వబ్రాహ్మణ సంఘాల హర్షం


జిల్లా స్వర్ణకార, విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న అప్పలాచార్యులు

అమలాపురం టౌన్, మార్చి 9: జయహో బీసీ డిక్లరేషన్‌లో విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేకంగా పలు పథకాలను ప్రకటించడం పట్ల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం, జిల్లా స్వర్ణకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అభినందన సభ దుడ్డువారి అగ్రహారంలోని విశ్వబ్రాహ్మణ సంఘ భవనంలో నిర్వహించారు. జిల్లా స్వర్ణకార సంఘ అధ్యక్షుడు తాళాబత్తుల అప్పలాచార్యులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలు పలు పర్యాయాలు వివరించినప్పటికీ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విశ్వబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. సీఎం జగన్ పాదయాత్రలో విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే స్థానం కేటాయించాలని డిమాండు చేశారు. టీడీపీ, జనసేన కూటమి విజయం సాధించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేస్తామని తీర్మానించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ మోసుగంటి ఫణిప్రకాష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు వరద సుబ్బలక్ష్మి, కోశాధికారి కోసూరి చిదంబరాచారి, నాయకులు పట్నాల వెంకటరమణ, చేబ్రోలు గంగానాగేశ్వరరావు, కట్టోజు వెంకటసుబ్బారావు, బొల్లోసు శ్రీకాంత్, పట్నాల గణేష్, వీరిన శ్రీనివాస్, వీరిన భీమరాజు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే కాపు కులస్తులకు మేలు

- కాపు నాయకులు
- టీడీపీ కాపు నాయకుల సమావేశం
- వ్యాపారులకు కాపు కార్పొరేషన్ రుణాలు


పార్టీ కార్యాలయంలో సమావేశమైన టీడీపీ, కాపు నాయకులు

ముమ్మిడివరం, మార్చి 9: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు కాపులకు చేసిందేమీ లేదని వైసీపీ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పేర్కొనడాన్ని ముమ్మిడివరంలోని కాపు నాయకులు ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో చిక్కాల అంజిబాబు అధ్యక్షతన శనివారం టీడీపీ కాపునాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు హయాంలోనే కాపులకు నిజమైన మేలు జరిగిందన్నారు. 2014ఎన్నికల ముందు మీ కోసం యాత్రలో చంద్రబాబు కాపులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం కాపు కార్పొరేషన్ ఏర్పాటుచేసి కాపు విద్యార్థులు విదేశీ విద్య, చిరు వ్యాపారులకు కాపు కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరు చేశారన్నారు. కేంద్రం ప్రకటించిన ఈబీసీ 10శాతం రిజర్వేషన్లు కాపులకు ఐదు శాతం కేటాయించి ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్నారన్నారు. అయితే జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని తొలగించి కాపులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. 2014లో రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు కృషిచేస్తుంటే ముద్రగడ పద్మనాభం చంద్రబాబును అనేక రకాల ఇబ్బందులు పెట్టారన్నారు. కాపులకు మేలు చంద్రబాబునాయుడు ద్వారానే జరిగిందని, ముద్రగడ వల్ల ఏవిధమైన మేలు జరగలేదన్నారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొలకోటి దొరబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, చిక్కాల అంజిబాబు, విళ్ల వీరాస్వామినాయుడు, గుద్దటి వీరాస్వామినాయుడు, యాళ్ల ఉదయ్, అడబాల సతీష్‌కుమార్, పళ్ల రాజబాబు, కురసాల శివబాబు, రంకిరెడ్డి రాంబాబు, చింతలపూడి కొండబాబు, పాయసం చిన్నీ, గోదశి గణేష్, అయ్యల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీవో 57 ప్రకారం వేతనాలు చెల్లించాలి


పంచాయతీ కాంట్రాక్టు వర్కర్ల జిల్లా శాఖ సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

అమలాపురం టౌన్, మార్చి 9: గ్రామ పంచాయతీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని జిల్లా గ్రామ పంచాయతీ కాంట్రాక్టు వర్కర్స్ సమావేశం ఆరోపించింది. అమలాపురం ఎంప్లాయీస్ హోం వద్ద జి.సత్యనారాయణ అధ్యక్షతన జిల్లాశాఖ సమావేశం శనివారం నిర్వహించారు. జిల్లా నాయకుడు దాకే జార్జి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా పంచాయతీ కార్మికుల వేతనాలు మాత్రం పెంచడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వం జీవో 57ప్రకారం 50శాతం జీతాలు ఇవ్వాలని నిబంధన ఇచ్చినప్పటికీ 30శాతం జీతాలు మాత్రమే చెల్లించడం దారుణమన్నారు. జీవో నంబరు 57 ప్రకారం 50శాతం జీతాలుగా చెల్లించాలని డిమాండు చేశారు. సమాన పనికి సమాన వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ కార్మికులందరికీ అమలు చేయాలన్నారు. నూతన కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా జార్జి, సహ కన్వీనర్లుగా గంటా రామకృష్ణ, జి.సత్యనారాయణ, బి.భీమారావు, పి.వేమలరావులను ఎన్నుకున్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మికులంతా ఉద్యమం ద్వారా హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, భాస్కరరావు తదితరులు మాట్లాడారు.

ఎన్నికల్లో టీడీపీ, జనసేనదే విజయం: వేగుళ్ల


20వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న వేగుళ్ల

మండపేట, మార్చి9: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులు విజయం ఖాయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్ల వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో వైసీపీకి ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 20వ వార్డులో టీడీపీ శ్రేణులతో కలిసి బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డులో ప్రజలను కలుసుకుని టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలు గురించి ఆయన వివరించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, కాళ్లకూరి శ్రీను, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, శిరంగు ఈశ్వరరావు, ఎం.సూర్యప్రకాశరావు, పార్టీ కార్యకర్తలు వున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా సత్తిబాబు


సత్తిబాబును సత్కరించిన దృశ్యం

యానాం, మార్చి 9: పుదుచ్చేరి పార్లమెంట్ ఎన్నికల సంబంధించి యానాం నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా మల్లాడి సత్యనారాయణ(సత్తిబాబు)ను నియమించారు. కాంగ్రెస్ అధిష్టానం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30నియోజవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. యానానికి సత్తిబాబును నియమించారు. స్థానిక ఫెర్రిరోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు సత్తిబాబును సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్ధాని దినేష్, దున్న చక్రవర్తి, లంక వెంకన్నబాబు, అంజయ్య చౌదరి, మున్నా, గణేష్, చంటి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రచారం

ఆత్రేయపురం, మార్చి9: టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు విజయాన్ని ఆకాంక్షిస్తూ పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. మండలంలోని 17 గ్రామాల్లో ఉమ్మడి పార్టీ నాయకులు ఇంటింటా వెళ్ళి మ్యానిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. అధిక సంఖ్యలో పార్టీ నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ టీడీపీ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, పార్టీ నాయకులు, మద్దూరి సుబ్బారావు, పి.పుల్లంరాజువర్మ, ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్‌లో దూరిన పాము

అల్లవరం, మార్చి 9: అల్లవరంలో శనివారం రాత్రి మోటార్‌సైకిల్‌లో విషపూరితమైన తాడేలు పాము దూరి కంగారు పెట్టింది. దీంతో స్థానికులు పామును బయటకు రప్పించి చంపేశారు.

సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకం


కళాశాల వద్ద నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న సోమశేఖరరావు తదితరులు

అమలాపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకమని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వనుము సోమశేఖరరావు పేర్కొన్నారు. సమాజంలో 50శాతం పైగా ఉన్న యువత తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య వ్యవస్థల బోలపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద నుంచి ఓటు వేద్దాం-ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే అంశంపై చేపట్టిన ర్యాలీని శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ర్యాలీలతో పాటు కళాజాతాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నిస్వార్థ పరులైన నాయకులను ప్రజాస్వామ్య బద్ధంగా ఎంపిక చేసుకోవాలని పిలుపునిచ్చారు. అవినీతి రహిత పాలకులతో దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు లోను కాకూడదన్నారు. కులమత రహితంగా సమాజ హితాన్ని కోరేవారికి పట్టం కట్టాలన్నారు. ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు యువత నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

ఉమ్మడి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి


బుచ్చిబాబు, హరీష్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

కాట్రేనికోన, మార్చి9: టీడీపీ-జనసేన ముమ్మిడివరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు శనివారం పల్లంకుర్రు రామాలయంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు, పవన్‌ల ఉమ్మడి ప్రభుత్వంలోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అమలు జరుగుతుందన్నారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో కరపత్రాన్ని ఉంచి పూజలు చేశారు. తనకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. పల్లంకుర్రులో అపరిష్కృత సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఆయనతో పాటు టీడీపీ పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్ ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీకి చెందిన గెడ్డం శ్రీను, సాపే నాగేశ్వరరావు టీడీపీలో చేరారు. జైభీమ్‌నగర్‌లో వెంట్రు సుదీర్ ఆధ్వర్యంలో 30మంది టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గంటి శాంతమ్మ, గంటి ఆదిలక్ష్మి, నేలపాటి దుర్గ, గంటి పాపాయమ్మ, నేలపాటి రమణ, సవరపు ఏసు, గంటి సాయికిరణ్, నేలపాటి రాజు, రాకుర్తి నవీన్ ఉన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

వైసీపీ సీనియర్ నాయకుడు పెన్మెత్స రామకృష్ణంరాజు (గెడ్డం కృష్ణ) శనివారం టీడీపీ-జనసేన ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గొల్లగరువుకు చెందిన 100మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం తీసుకున్నారు.

లోక్ అదాలత్‌లో 28కేసుల పరిష్కారం

యానాం, మార్చి 9: యానాం సబ్‌మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 28కేసులు పరిష్కారమయ్యాయని యానాం లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ రాజమోహన్ తెలిపారు. 28కేసులకు సంబంధించి రూ.14.97 లక్షలు ఆయా లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ప్రభుత్వ న్యాయవాది సలాది శ్రీనివాస్, నడింపల్లి శ్రీనివాసరాజు, తాజుద్దీన్‌భాషా, మూర్తి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కళావెంకట్రావు కుమారుడి మృతి



అంబాజీపేట, మార్చి 9: ముక్కామలకు చెందిన మాజీ మంత్రి దివంగత కళా వెంకట్రావు కుమారుడు బ్రహ్మానంద శర్మ(75) శుక్రవారం రాత్రి మృతిచెందారు. శర్మ కాకినాడ ఆసుపత్రికి జనరల్ చెకప్ కోసం వెళ్లారు. అయితే అక్కడ ఆయనకు గుండెనొప్పి వచ్చి అక్కడికక్కడే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన స్టేట్ బ్యాంకులో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

పోలీసుల కవాతు

అల్లవరం, మార్చి 9: అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో అల్లవరం, పలు గ్రామాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలీసు కవాతు చేపట్టారు.

భవన నిర్మాణ కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అమలాపురం టౌన్, మార్చి 9: భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు కార్పెంటర్లతో పాటు భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారాన్ని మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండు చేశారు. జిల్లా సంఘ కార్యాలయంలో శనివారం కన్వీనర్ కుసుమే నరసింహరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశం సూర్యనారాయణమూర్తి మాట్లాడారు. 50ఏళ్లు దాటిన కార్పెంటర్లు, భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలన్నారు. విద్యుత్ సబ్సిడీ కల్పించాలని, రాయితీపై కలపను సరఫరా చేయాలని కోరారు. రెడీమేడ్ గుమ్మాలు, కిటీకీలు నిషేధించాలన్నారు. సమావేశంలో నాయకులు దంగేటి రామకృష్ణ, అప్పారి శ్రీనివాస్, కోమలి విఘ్నేష్, ముక్కామల వీరభద్రరావు, అంగర జగదీష్, జల్లి సత్యనారాయణ, గిడ్ల రాంబాబు, బట్టేలంక నరసింహారావు పాల్గొన్నారు.

దాట్ల బుచ్చిబాబు ప్రచారాన్ని విజయవంతం చేయాలి

ముమ్మిడివరం, మార్చి 9: టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో అర్ధాని శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల15న అనాతవరం, సీహెచ్ గున్నేపల్లి, 16న ఠాణేలంక, పళ్లవారిపాలెం, చింతలపూడిపాలెం లంకాఫ్ ఠాణేలంకల్లో ప్రచారం చేస్తారన్నారు. రాష్ట్ర కమిటీ, నియోజకవర్గ కమిటీ, మండల కమిటీల్లో పదవుల్లో ఉన్నవారంతా తప్పనిసరిగా ఈప్రచార కార్యక్రమంలో పాల్గొన్నాలన్నారు. కార్యక్రమంలో గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, పొత్తూరి విజయభాస్కరవర్మ మిమ్మితి చిరంజీవి, చిక్కాల అంజిబాబు, నడిమింటి సూర్యప్రభాకరం, దాట్ల బాబు, యాళ్ల ఉదయ్, దంగేటి శ్రీనివాస్ ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, బొంతు నాగరాజు, కురసాళ శివబాబు, రంకిరెడ్డి రాంబాబు, వీసాల చంద్రదరావు, చింతలపూడి కొండబాబు, కాశి మూర్తి, గుద్దటి వీరాస్వామినాయుడు పాల్గొన్నారు.

ముగిసిన సీసీఎల్ క్రికెట్ లీగ్ పోటీలు

అమలాపురం టౌన్, మార్చి 9: అమలాపురం శ్రీచెన్నమల్లేశ్వరా కళాపరిషత్ వేదిక ప్రాంగణంలో నాలుగు రోజులుగా ఫ్లడ్ లైట్ వెలుగుల్లో నిర్వహిస్తున్న సీసీఎల్ క్రికెట్ లీగ్ పోటీలు శనివారం ముగిశాయి. ఈపోటీల్లో 32జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో హైస్కూలు ఎలివెన్, రాజేష్ ఎలివెన్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. హైస్కూలు ఎలివెన్ జట్టు విన్నర్‌గా, రాజేష్ ఎలివెన్ జట్టు రన్నర్‌గాను నిలిచింది. విన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.30వేలు, ట్రోఫీని ప్రముఖులు నల్లా శ్రీధర్, దున్నాల దుర్గలు అందించారు. రన్నర్స్ జట్టుకు రూ.20వేలు, ట్రోఫీని కల్వకొలను బాబి, ఉద్దిశ చిన్నా, నల్లా సంజయ్, పిండి రాజా, పోలిశెట్టి కిరణ్‌లు అందజేశారు. సీసీఎల్ నిర్వాహకులు పేరాబత్తుల ఫణి, ఉద్దిశ కిశోర్, నల్లా సాయితో పాటు నల్లా మల్లిబాబు, ముచ్చర్ల శ్రీను, ముచ్చర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. విజయోత్సవ వేడుకల్లో భాగంగా పెద్దఎత్తున బాణసంచా కాల్చారు.

పంట కాల్వలో తూడు తొలగింపునకు రూ.లక్ష నిధులు

పి.గన్నవరం, మార్చి 9: ప్రధాన పంటకాల్వతో పాటు పలు చిన్న కాల్వలో తూడు తొలగింపునకు కలెక్టర్ హిమాన్షుశుక్లా రూ.లక్ష నిధులు మంజూరు చేసినట్లు తహసీల్దార్ ఎస్‌కే హుస్సేన్ తెలిపారు. కెనాల్ రోడ్డులో ప్రధాన పంట కాల్వ, మొండెపులంక పశ్చిమచానల్, హస్పటల్ చానల్, ముంగండ బ్రాంచ్ చానల్ ప్రాంతాల్లో తూడు తొలగించి, రైతుల పొలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బెల్లంపూడిలో ఎక్స్‌కవేటర్ సహాయంతో తూడు తొలగింపు పనులను ఆయన పరిశీలించారు.

హనుమాన్‌కు రూ.1.50లక్షలతో వెండి మకరతోరణం

ఆత్రేయపురం, మార్చి 9: ర్యాలిలో వేంచేసియున్న అభయ ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తికి ఒక భక్తుడు రూ.1.50లక్షలతో తయారు చేయించిన వెండి మకరతోరణం సమర్పించారు. మకరతోరణాన్ని సంప్రోక్షణ నిర్వహించి స్వామివారికి అలంకరించారు.

ముమ్మిడివరంలో బ్రదర్ అనిల్ పర్యటన



ముమ్మిడివరం, మార్చి 9: ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా బ్రదర్ అనిల్ శనివారం ముమ్మిడివరంలో పర్యటించారు. ఈసందర్భంగా ఏఐసీసీ సభ్యుడు పెన్మెత్స జగ్గప్పరాజు నివాస గృహంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఎన్నికల వ్యూహరచన చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గాల అధ్యక్షుడు గెడ్డం సురేష్‌బాబు, వంటెద్దు బాబి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, కుడుపూడి శ్రీనులతో సమావేశమయ్యారు. జిల్లాలో, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై సమీక్షించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుపై వ్యూహరచన చేశారు. కార్యక్రమంలో సాధనాల రాజాజీ, కంచుస్తంభం సోనీ, దివి వెంకన్నబాబు, అయితాబత్తుల పండుబాబు, రాయుడు వెంకటరమణ, రాయుడు గంగాభవానీ, తోట శ్రీను, మొల్లేటి వెంకటేశ్వరరావు ఉన్నారు.

చేయూత నమూనా చెక్కు పంపిణీ

ఉప్పలగుప్తం, మార్చి 9: పలు అభివృద్ధి కార్యక్రమాల్లో శనివారం మంత్రి విశ్వరూప్ పాల్గొన్నారు. గొల్లవిల్లిలో చేయూత నమూనా చెక్కును పంపిణీ చేశారు. వేదికపై ఉన్న వైసీపీ నాయకులు జైజగన్ అని నినదించినా సమావేశంలోని మహిళలు మౌనంగాఉండిపోయారు. ఇళ్ల స్థలాల పత్రాలు పంపిణీ చేశారు. తొలుతసర్పంచ్ కడిమి చిన్నవరాజు అధ్యక్షతన ఆదిలక్ష్మీపురంలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపనచేశారు. సర్పంచ్ నల్లా బాబండి అధ్యక్షతన వానపల్లిపాలెంలో సచివాలయాన్ని, రమణయ్యనగర్‌లో వాటర్ ట్యాంకును ప్రారంభించారు. సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా అధ్యక్షతన గొల్లవిల్లి పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, వైసీపీమండలఅధ్యక్షుడు బద్రి బాబ్జి, ఎంపీటీసీ చిక్కం త్రినాదబాలసుబ్రహ్మణ్యం, ఉద్యానవన విశ్వవిద్యాలయ డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	బాయ్స్
వెంకటరమణ	ఆపరేషన్ వాలంటైన్
శ్రీలలిత	గామి
శేఖర్ స్క్రీన్-1	ఊరిపేరు భైరవకోన
శేఖర్ స్క్రీన్-2	బుల్లెట్
రమా	ప్రేమలు
గణపతి	గుంటూరు కారం
వెంకటపద్మావతిస్క్రీన్-1	భీమ
వెంకటపద్మావతి స్క్రీన్-2	రికార్డు బ్రేక్

వేంకటేశ్వరస్వామి ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం

ద్రాక్షారామ, మార్చి 9: రామచంద్రపురం పట్టణంలో హౌసింగుబోర్డు కాలనీలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివారి ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. ధర్మకర్తల మండలి సభ్యులుగా గంగ్రోతు వెంకటేశ్వరరావు, సలాది వెంకటరావు, చంద్రు శివరామసుబ్బారావు చౌదరి, సూరపునేని గీత, సుందరపల్లి సూర్యకుమారి, వీరకుమారి, యనమదల అనంతలక్ష్మి, ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఎస్.టి.పి.రాధాకృష్ణమాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా సూరపునేని గీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాజ్యసభసభ్యులు పిల్లిసుభాష్‌చంద్రబోస్, ఈవో పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రాజోలు, మార్చి9: రాజోలు నియోజకవర్గంలో జనసేన-టీడీపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి, టీడీపీ పార్లమెంటరీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌కు ఓట్లువేసి గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పొన్నమండలో టీడీపీ సీనియర్ నాయకులు కడలి అబ్బు స్వగృహం వద్ద గ్రామశాఖ టీడీపీ అధ్యక్షుడు దాకే ఏడుకొండలు అధ్యక్షతన శనివారం జరిగిన టీడీపీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ బూత్ కమిటీల కోఆర్డినేటర్ చాగంటి స్వామి, పెచ్చెట్టి శ్రీనివాస్, కడలి మోహన్, కామన సాయిబాబు, ఉండ్రు రాజబాబు, మామిడిశెట్టి సత్యనారాయణ, అప్పారి సతీష్, కుడుపూడి సత్యనారాయణ, పుల్లేటికుర్తి రత్నం, అప్పారి వీరవెంకటసత్యనారాయణ, మోకా నాగిరెడ్డి, కడలి తాతయ్య, అప్పారి సతీష్ పాల్గొన్నారు.

శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు



కొత్తపేట, మార్చి 9: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) ఆలయంలో భక్తులు శనివారం విశేష సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి సర్వదర్శనముల అనంతరం తైలాభిషేకాలకు క్యూకట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,69,030 ఒక్కరోజు ఆదాయం లభించగా ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. భక్తులకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయం

అంబాజీపేట, మార్చి 9: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించడమే వైసీపీ ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఇరుసుమండ, వక్కలంక, పసుపల్లిలో నిర్మించిన సచివాలయ భవనం, సీసీ రోడ్లను ఆయన శనివారం ప్రారంభించారు. అంబాజీపేటలో అంజుమన్ ఇందాదుల్ ముస్లిమిన్ మసీదు నిర్మాణానికి వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్‌లు అక్కిశెట్టి నాగమణి, వాసంశెట్టి రేవతి, మట్టపర్తి నాగరాజు, నాయకులు దొమ్మేటి సత్యమోహన్, నాగాబత్తుల సత్యానందరావు, అక్కిశెట్టి పెద్ద, నాగవరపు నాగరాజు, వాసంశెట్టి పెదబాబు పాల్గొన్నారు.

మహాసౌర యాగపూజల్లో మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం, మార్చి 9: విలసవిల్లి శ్రీరామ మందిరంలో జరుగుతున్న నక్షత్ర నవగ్రహపూర్వక మహాసౌరయాగంలో శనివారం మంత్రి పినిపే విశ్వరూప్ పాల్గొన్నారు. యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికి యాగ విశిష్టతను వివరించారు. సర్పంచ్ సలాది ఊర్మిళాదేవీ సతీష్, వైసీపీ నాయకుడు సలాది సతీష్ పాల్గొన్నారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

చెరువుల వద్ద మోటార్ ఇంజన్ల చోరీ

అల్లవరం, మార్చి9: తాడికోన, గూడాల,దేవగుప్తం, తూర్పులంక,డి.రావులపాలెం,గ్రామాల్లోభారీ సంఖ్యలో మోటార్లు చోరీకి గురయ్యాయని రైతులు ఫిర్యాదు చేశారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని తాడికోన సర్పంచ్ సాదనాల సూర్యవెంకటనాగమణి కోరారు.

బీసీల అభ్యున్నతికి కృషిచేస్తా: బండారు


ఊబలంకలో ప్రచారం నిర్వహిస్తున్న బండారు సత్యానందరావు

రావులపాలెం, మార్చి 9: టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిగిలిన సామాజిక వర్గాలతో పాటు బీసీల అభ్యున్నతికి విశేష కృషి చేస్తుందని కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. ఊబలంక బీసీ ప్రాంతాల్లో, తోకలంకలో బాబుష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టి అమలుచేసే పథకాలపై ప్రజలకు వివరించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. బీసీ డిక్లరేషన్‌తో బీసీలను అన్నివిధాలా అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఉమ్మడి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైను నిర్మాణానికి శంకుస్థాపన

ద్రాక్షారామ, మార్చి 9: రామచంద్రపురం పట్టణంలో శాంతినగర్‌లో ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించనున్న డ్రైను నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సర్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తల పిల్లి సూర్యప్రకాష్ శంకుస్థాపన చేశారు. తొలుత జల్లిపేటలో పర్యటించి సామాజిక భవన నిర్మాణం సమస్యపై అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలరు కోటి శ్రీకన్య, పట్టణ వైసీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు వంట పాత్రల బహూకరణ

ఐ.పోలవరం, మార్చి 9: మురమళ్ల శ్రీవీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు గ్రామానికి చెందిన కేదారశెట్టి శ్రీనివాస్ దంపతులు రూ.40వేలు విలువైన వంటసామగ్రిని ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణకు అందించారు. దాతను పలువురు అభినందించారు.

కె.గంగవరంలో గడపగడపకు..

కె.గంగవరం, మార్చి 9: కె.గంగవరంలో శనివారం గడగగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో వైసీపీ రాజానగరం నియోజకవర్గం పరిశీలకుడు వట్టికూటి సూర్యచంద్రరాజశేఖర్ ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, సర్పంచ్ కోటి లక్ష్మినరసమ్మ వెంకట్రావు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయసలహాసంఘం సభ్యుడు బత్తుల అప్పారావు, దంగేరు ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, జుత్తుగ శ్యామ్‌ప్రసాద్, తోకల శ్రీను, రెడ్డి జయరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట, మార్చి 9: ఏడిదలో జరిగే రథోత్సవం సందర్భంగా ఆదివారం ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఏడిదసబ్‌స్టేషన్ పరిధిలో ఆలమూరు మండలంలో గ్రామాలు, తాపేశ్వరంలో కొన్నిప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం, మార్చి 9: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వఅభియాన్‌లో భాగంగా అంగర పీహెచ్‌సీలో శనివారం వైద్యాధికారిణి డా. రత్నకుమారి ఆధ్వర్యంలో 70మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా అందజేశారు. కపిలేశ్వరపురం ఎంపీటీసీ శీలం భాస్కరరావు గర్భిణులకు రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్స్, పండ్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో జె. మల్లికార్జునుడు, హెచ్‌ఈ రామారావు, హెచ్‌వీ టి.మేరీ మణి, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

ముమ్మిడివరం, మార్చి 9: కాంగ్రెస్ పార్టీతోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముసిణి రామకృష్ణారావు పేర్కొన్నారు. ముమ్మిడివరంలో శ్రీబాలయోగీశ్వరులను శనివారం ఆయన దర్శించుకుని నియోజకవర్గంలో పర్యటించారు. ముమ్మిడివరం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వానికి, పార్టీ అధిష్టానానికి తాను దరఖాస్తు చేశానన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో శనివారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో బ్రోచర్లను అందజేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.శివప్రసాద్, రెడ్డి త్రిమూర్తులు, యల్లమిల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాయవరంలో పోలీసుల కవాతు

రాయవరం, మార్చి 9: రాయవరంలో సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకు శనివారం మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.నరేష్, ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు మొండికోడుకు సాగునీరు

మలికిపురం, మార్చి 9: మలికిపురం భూపతివారి పేట నుంచి మలికిపురం సెంటర్ మీదుగా మోరి వెళ్లే మొండికోడు చానల్‌కు ఇరిగేషన్ అధికారులు మోక్షం కల్పించారు. శనివారం తహసీల్దార్ అనితకుమారి పర్యవేక్షణలో కాల్వలోని గుర్రపుడెక్కను తొలగించారు. సాగునీటిని రైతులకు వంతులవారీగా అందిస్తామన్నారు. సర్పంచ్ రాజ్యలక్ష్మి తులసీభాస్కర్, నల్లి శివ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మామిడికుదురు, మార్చి 9: మగటపల్లిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, అమలాపురం ఎంపీ చింతా అనురాధలు శనివారం ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కె.వనజాకుమారి, బొలిశెట్టి భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు

మలికిపురం, మార్చి 9: ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శనివారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గుడిమెళ్లంకలో రూ.23లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, మలికిపురంలో జేజీఎం నిధులతో నిర్మించిన 10వేల లీటర్ల వాటరు ట్యాంకును ప్రారంభించారు. గుడిమెళ్లంక నుంచి రామరాజులంక వెళ్లే సీసీ రోడ్డును ప్రారంభించారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, సర్పంచ్‌లు చొప్పల విజయకుమారి, గెడ్డం రాజ్యలక్ష్మి, గెడ్డం తులసీభాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు 500 దుప్పట్లు పంపిణీ

అమలాపురం టౌన్, మార్చి 9: అమలాపురం శ్రీస్వామివివేకానంద యోగాశ్రమం వ్యవస్థాపకుడు, యోగాగురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లో పేదలకు శనివారం దరపల్లిలో పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ పేదలకు దుప్పట్లు అందజేశారు.